సాక్షి
రంగారెడ్డి
బుధవారం । 24 । ఏప్రిల్ । 2024



సరూర్‌నగర్‌లో కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి



కందుకూరు: హనుమాన్ భక్తుల ర్యాలీ



మొయినాబాద్: హనుమాన్ శోభాయాత్ర

జై హనుమాన్

హనుమాన్ జయంతి వేడుకలను మంగళవారం జిల్లా వ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఉదయం నుంచే భక్తులు హనుమాన్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో పలుచోట్ల శోభాయాత్రలు చేపట్టారు. 'రామ్‌లక్ష్మణ్ జానకీ.. జై బోలో హనుమాన్‌కీ' అంటూ ఆయా గ్రామాల్లో ఊరేగింపులు, ర్యాలీలు తీశారు.

న్యూస్‌రీల్

రైతు నేస్తం కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోండి



వీడియో కాన్ఫరెన్స్‌ను పర్యవేక్షిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి

మొయినాబాద్: వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించే రైతు నేస్తం కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి అన్నారు. మొయినాబాద్ రైతు వేదికను మంగళవారం సందర్శించి వీడియో కాన్ఫరెన్స్‌ను పర్యవేక్షించారు. వరిలో నేరుగా విత్తే పద్ధతి, మామిడిలో సస్యరక్షణ చర్యల గురించి శాస్త్రవేత్తలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి మంగళవారం రైతు వేదికల్లో నిర్వహించే రైతు నేస్తం కార్యక్రమాల్లో రైతులు పాల్గొని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శాస్త్రవేత్తలు ఇచ్చే సూచనలు, సలహాలు తెలుసుకోవాలన్నారు. మండలాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల వద్దకు రైతులు పండించిన వరి ధాన్యం తీసుకెళ్లి విక్రయించాలన్నారు. వడ్లలో తేమ 17 శాతం కంటే తక్కువ ఉండేలా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి రాగమ్మ, ఏఈఓలు కుమార్, సునీల్, రైతులు పాల్గొన్నారు.

నాగర్‌కర్నూల్‌లో మల్లురవి నామినేషన్



నామినేషన్ దాఖలు చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి మల్లురవి

ఆమనగల్లు: నాగర్‌కర్నూల్ లోక్‌సభ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మల్లురవి మంగళవారం నామినేషన్ దాఖలు చేశారు. మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్‌తో కలిసి ఆయన నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో తన నామినేషన్ పత్రాలను కలెక్టర్ ఉదయ్‌కుమార్‌కు అందించారు.

దేశ అభివృద్ధి బీజేపీతోనే సాధ్యం



బూర నర్సయ్యగౌడ్ సమక్షంలో బీజేపీలో చేరిన బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు

మంచాల: దేశ అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని ఆ పార్టీ భువనగిరి ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్య గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గోగిరెడ్డి లచ్చిరెడ్డి అన్నారు. మండలంలోని ఆరుట్ల గ్రామానికి చెందిన బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు పలువురు మంగళవారం బీజేపీలో చేరారు. వారికి బూర నర్సయ్య గౌడ్ కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నరేంద్రమోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో దూసుకెళ్తోందని అన్నారు. ప్రపంచంలోనే భారత దేశానికి ఒక ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చిన ఘనత బీజేపీదే అని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి, పేద ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేస్తోందన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు పాండాల జంగయ్య గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

టీఎస్ బీపాస్ ద్వారానే అన్ని రకాల అనుమతులు

సాక్షి, సిటీబ్యూరో: అన్ని రకాల భవన నిర్మాణ అనుమతులకు సింగిల్‌విండో వ్యవస్థ టీఎస్ బీపాస్ ద్వారా మాత్రమే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని హెచ్‌ఎండీఏ అధికారులు తెలిపారు. ఈ మేరకు 2016 నుంచి అమల్లో ఉన్న డెవలప్‌మెంట్ పర్మిషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (డీపీఎంఎస్)ను రద్దు చేసినట్లు పేర్కొన్నారు. డీపీఎంఎస్ ద్వారా ఇప్పటికే వచ్చిన, వివిధ దశల్లో ఉన్న దరఖాస్తులను మాత్రం పరిశీలించి పరిష్కరిస్తారు. కొత్తగా డీపీఎస్ ద్వారా వచ్చే దరఖాస్తులను అనుమతించబోరు. హెచ్‌ఎండీఏ పరిధిలోని పంచాయతీల్లో భవన నిర్మాణాలు, లే అవుట్ పర్మిషన్‌లు, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్‌లు తదితర అనుమతుల కోసం ఇప్పటి వరకు డీపీఎస్ ద్వారా దరఖాస్తు చేసుకొనే సదుపాయం ఉండేది. తాజాగా హెచ్‌ఎండీఏ పరిధిలోని గ్రామాలకు సైతం టీఎస్‌బీపాస్ సేవలను విస్తరించారు. చేంజ్ ఆఫ్ ల్యాండ్ యూజ్ సర్టిఫికెట్‌లకు మినహాయింపు ఉంటుంది.

ఉక్కపోత.. మృత్యువాత

- భానుడి ప్రతాపానికి విలవిల్లాడుతున్న కోళ్లు
- ఎండ వేడి తట్టుకోలేక నిత్యం వందలాదిగా మృతి
- రూ.కోట్లలో నష్టం
- లబోదిబోమంటున్న పౌల్ట్రీ నిర్వాహకులు



తమ్మలోనిగూడలో ఎండల తీవ్రతకు అల్లాడుతున్న కోళ్లు



ఎండ వేడికి యాచారం-చౌదర్‌పల్లి గ్రామాల మధ్యన మృతి చెందిన కోళ్లు

యాచారం: భానుడి ప్రతాపానికి కోళ్లు గుడ్లు తేలేస్తున్నాయి. పక్షం రోజులుగా ఎండల తీవ్రత పెరగడంతో వేడి తట్టుకోలేక వందలాదిగా మృతి చెందుతున్నాయి. పౌల్ట్రీఫాంలపై ఆధారపడి జీవనోపాధి పొందుతున్న చిన్న, సన్నకారు రైతులు ఇది చూడలేక తల్లడిల్లిపోతున్నారు. పౌల్ట్రీఫాంల్లో పెరిగే కోళ్లకు చల్లదనం కల్పించే విషయంలో రక్షణ చర్యలు తీసుకుంటున్నా భానుడి భగభగలకు అవేవీ ఫలితాన్ని ఇవ్వడం లేదు. ఇబ్రహీంపట్నం డివిజన్‌లోని యాచారం, మంచాల, ఇబ్రహీంపట్నం తదితర మండలాల్లో 650 మంది రైతులు ఆయా మండలాల్లోని పీఏసీఏస్‌లు, వివిధ బ్యాంకుల్లో రూ.వంద కోట్లకుపైగా రుణాలు పొంది పౌల్ట్రీఫాంలు నడుపుతున్నారు. ఇంటిగ్రేషన్ పద్ధతిపై ఆయా కంపెనీల నుంచి కోడి పిల్లలను పంపిణీ చేయించుకుని రెండు నుంచి రెండున్నర కిలోల బరువు పెరిగే వరకు తమ పౌల్ట్రీల్లో పెంచుతారు. పెంపకం సమయంలో కోడి పిల్లలకు దాణా, వైద్యం కంపెనీ ప్రతినిధులే చూస్తారు. 40 నుంచి 45 రోజుల మధ్యన కంపెనీ ప్రతినిధులకే కోళ్లను విక్రయిస్తారు. విక్రయించిన కోళ్లకు కిలోకు రూ.4.30 వరకు రైతులకు చెల్లిస్తారు. కోళ్ల పెంపకంపై ఆధారపడిన రైతులు నెలకు రూ.50 వేల నుంచి రూ.లక్షకు పైగా ఆదాయం గడిస్తారు. కోవిడ్ ప్రభావంతో రెండేళ్ల పాటు పౌల్ట్రీ రంగం కుదేలవగా, తాజాగా ఎండల తీవ్రతతో వందలాదిగా చనిపోతున్న కోళ్లతో అంతో.. ఇంతో వచ్చే ఆదాయాన్ని కూడా కోల్పోతున్నారు.

ఉపశమనం కోసం ..

ఎండల తీవ్రత నుంచి కోళ్లకు ఉపశమనం కలిగించడం కోసం రైతులు ఫ్యాన్లు ఏర్పాటు చేయడం, గోనె సంచులు కట్టి నీళ్లు చల్లడం, స్ప్రింక్లర్ల వంటి రక్షణ చర్యలు చేపడుతున్నారు. అయినా తట్టుకోలేని కోళ్లు ఎండ తీవ్రతకు మృత్యువాత పడుతూనే ఉన్నాయి. యాచారం, మంచాల, ఇబ్రహీంపట్నం మండలాల్లో బోరుబావుల్లో భూగర్భజలాలు అమాంతం తగ్గిపోవడంతో కోళ్లను కాపాడుకోవడం, వాటి దాహార్తి తీర్చడం కోసం రైతులు రూ.800 నుంచి రూ.1,500 ఖర్చు చేసి ట్యాంకర్ ద్వారా నీటిని కొనుగోలు చేస్తున్నారు. కోళ్లు పెరిగే 40 రోజుల్లోనే కేవలం నీటికే రూ.40 వేలు ఖర్చు చేస్తున్నారు. వ్యవసాయ పనుల్లేకపోవడంతో రైతులే స్వయంగా కోళ్ల పెంపకంలో శ్రమిస్తున్నారు. కోళ్ల మృతిపై ఇంటిగ్రేషన్ సంస్థలు నిర్ధారణ చేసుకున్న తర్వాత రైతులు సమీపంలోని వ్యవసాయ పొలాల్లో గుంతలు తీసి పూడ్చేస్తున్నారు. కొన్నిచోట్ల ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండానే మృతి చెందిన కోళ్లను పడేయడంతో కుక్కలకు ఆహారంగా మారుతున్నాయి.

రూ. కోటికి పైగా నష్టం

ఇబ్రహీంపట్నం డివిజన్‌లోని ఆయా మండలాల్లో పౌల్ట్రీఫాంలు ఏర్పాటు చేసుకున్న 650 మంది రైతులు ఆయా పీఏసీఎస్, వివిధ బ్యాంకుల్లో రూ. వంద కోట్ల వరకు రుణాలు పొందారు. అన్నీ అనుకూలిస్తే 10 వేల కోళ్ల పెంపకం చేసే రైతులకు 40 రోజులకు రూ. 60 వేల నుంచి రూ.80 వేలు, 20 వేల కోళ్ల పెంపకం చేసే రైతులకు రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు ఆదాయం వస్తుంది. దీంతో ఏటా బ్యాంకు వాయిదాలు సక్రమంగా చెల్లించే అవకాశం ఉంది. కానీ ఎండల తీవ్రతతో వేలాది కోళ్లు మృతి చెందడంతో రైతులు నిత్యం పెద్ద ఎత్తున నష్టాన్ని చవిచూస్తున్నారు. ఇంటిగ్రేషన్ సంస్థలు కోడి పిల్లల ఖర్చు మాత్రమే భరిస్తారు. పెంపకానికి ఉపయోగించే దాణా, వైద్యం ఖర్చులు రైతే భరించాల్సి ఉంటుంది. ఎండల తీవ్రతతో పక్షం రోజులుగా ఆయా గ్రామాల్లో పౌల్ట్రీఫాంల్లో వేలాది కోళ్లు మృతి చెందడంతో ఆదాయం దేవుడెరుగు అప్పులే మిగిలేలా ఉన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వేలల్లో విద్యుత్ బిల్లు



రెండు షెడ్లల్లో 18 వేల కోళ్ల పెంపకం చేస్తున్నాను. ఎండల తీవ్రతకు కోళ్లు తట్టుకోలేకపోతున్నాయి. రెండు షెడ్లలో 18 ఫ్యాన్లు బిగించాను. ఉదయం నుంచి సాయంత్రం వరకు స్ప్రింక్లర్ల ద్వారా నీటిని చల్లిస్తాం. నెలకు విద్యుత్ బిల్లే రూ.20 వేలు దాటుతోంది.

– దెంది లక్ష్మారెడ్డి, రైతు, తమ్మలోనిగూడ

చివరికి అప్పులే..



కోళ్లను కాపాడుకోవడం కోసం పడరాని పాట్లు పడుతున్నాం. ఇంటిగ్రేషన్ కంపెనీలు కోళ్ల తరలింపులో కిలోకు రూ.6 వరకు ఇస్తామని చెప్పినా ఇవ్వడం లేదు. కిలోకు రూ.4.30 చెల్లిస్తున్నారు. అప్పు చేసి బ్యాంకు వాయిదాలు చెల్లించాల్సి వస్తోంది.

– కలకొండ బీరప్ప, రైతు, నక్కర్తమేడిపల్లి

ప్రభుత్వం ఆదుకోవాలి



కోవిడ్‌తో రెండేళ్ల పాటు కోళ్ల పెంపకంతో తీవ్రంగా నష్టపోయాం. ప్రస్తుతం ఎండల తీవ్రతతో నిత్యం మృత్యువాత పడుతున్నాయి. ప్రకృతి వైపరీత్యం కింద సర్కార్ కోళ్ల పెంపకం చేసే రైతులను ఆదుకోవాలి. రుణాలపై వడ్డీ మాఫీ చేసేలా చూడాలి.

– కాలె మల్లేష్, రైతు, తమ్మలోనిగూడ

'క్యామ'ను గెలిపించుకుందాం

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: బీఆర్ఎస్ పార్టీ భువనగిరి ఎంపీ అభ్యర్థిగా క్యామ మల్లేశ్‌ను గెలిపించుకుందామని పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ సమన్వయ సమితి సమావేశం మంగళవారం శేరిగూడలోని సీకే కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి ఎంపీ అభ్యర్థిగా మన ప్రాంత వాసి, శేరిగూడ ముద్దుబిడ్డ క్యామ మల్లేశ్‌కు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అవకాశం ఇచ్చారన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలంటే తప్పకుండా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం నుంచి అత్యధిక మెజార్టీ ఇవ్వాలని తెలిపారు. గతంలో తెలంగాణ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఇంటింటికీ తీసుకెళ్లాలని సూచించారు. కాంగ్రెస్, బీజేపీలకు తెలంగాణలో ఓటు అడిగే హక్కు లేదన్నారు. ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ గుర్తించి మీ బిడ్డకు అవకాశం ఇచ్చిందని.. సామాన్యుడిగా మీ ముందుకు వచ్చానని.. మీరు గెలిపిస్తే సేవ చేస్తానన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌రెడ్డి, ఎంపీపీ కృపేష్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, చిత్రంలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్

మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య

షాబాద్: కార్మికుల సంపదను కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతున్న నరేంద్రమోదీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య పేర్కొన్నారు. మండల పరిధిలోని హైతాబాద్ వెల్స్‌పన్ పరిశ్రమ ఎదుట మంగళవారం మేడే అంతర్జాతీయ కార్మిక దినోత్సవం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మిక సంఘాలు పోరాడి సాధించుకున్న చట్టాలను మోదీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని మండిపడ్డారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు పానుగంటి పర్వతాలు మాట్లాడుతూ.. మేడే స్ఫూర్తితో కార్మిక వర్గం సమరశీల పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రామస్వామి, ఇండస్ట్రియల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దత్తు నాయక్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యుడు దేవేందర్, మండల అధ్యక్షుడు రుక్కయ్య, సీపీఐ మండల కార్యదర్శులు నారాయణ, జంగయ్య, తదితరులు పాల్గొన్నారు.



కార్మిక దినోత్సవం వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి

కాంగ్రెస్ హామీలన్నీ ఉత్తి మాటలే..

మహబూబ్‌నగర్ ఎంపీ, బీఆర్ఎస్ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి

షాద్‌నగర్: కాంగ్రెస్ హామీలన్నీ ఉత్తుత్తి మాటలేనని మహబూబ్‌నగర్ ఎంపీ, బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మంగళవారం షాద్‌నగర్ పట్టణంలోని రెడ్ రోజ్ గార్డెన్‌లో ఫరూఖ్‌నగర్, షాద్‌నగర్ మున్సిపాలిటీ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మన్నె శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు అనేక ఉచిత హామీలు ఇచ్చిందని, అధికారం చేపట్టిన తర్వాత వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి మాటలను ప్రజలు నమ్మడం లేదన్నారు. రాష్ట్రంలో వ్యవసాయరంగాన్ని అభివృద్ధి చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాల ప్రజావ్యతిరేఖ విధానాలను ప్రజల్లో తీసుకెళ్లి విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ మాట్లాడుతూ.. కొట్లాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని కేసీఆర్ అహర్నిషలు శ్రమించి అభివృద్ధి చేశారని అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీ అభ్యర్థి నాగర్‌కుంట నవీన్‌రెడ్డి, నాయకులు దూదిమెట్ల బాల్‌రాజ్, రాజావరప్రసాద్, ఈట గణేశ్, రాంబల్ నాయక్, లక్ష్మణ్ నాయక్, వంకాయల నారాయణ రెడ్డి, బెంది శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలోచించి ఓటు వేయండి

కొందుర్గు: తెలంగాణ అభివృద్ధిలో నాటికి, నేటికీ ఎలాంటి తేడా ఉందో ఒక్కసారి ఆలోచించి ఓటు వేయాలని మహబూబ్‌నగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యకర్తల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే లోక్‌సభ ఎన్నికల్లో అధిక స్థానాలు బీఆర్ఎస్ గెలుపొందాలని అన్నారు. మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. ఉమ్మడి పాలమూరును ఐదు జిల్లాలుగా విభజించి అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత కేసీఆర్‌దేనన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, మహబూబ్‌నగర్ మాజీ జెడ్పీ చైర్మన్లు నవీన్ కుమార్ రెడ్డి, ఈట గణేశ్, బీఆర్ఎస్ నేతలు రామకృష్ణా రెడ్డి, నారాయణ రెడ్డి, వైస్ ఎంపీపీ రాజేష్ పటేల్, బీఆర్ఎస్ కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండల కమిటీ అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి, సయ్యద్ హఫీజ్ పాల్గొన్నారు.

13 మంది.. 14 సెట్లు

- చేవెళ్ల లోక్‌సభ స్థానానికి నామినేషన్లు దాఖలు
- కాంగ్రెస్, బీఆర్ఎస్ సహా పలువురు స్వతంత్రులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: లోక్‌సభ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో భాగంగా చేవెళ్ల లోక్‌సభ స్థానానికి మంగళవారం 13 మంది అభ్యర్థులు.. 14 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. వీరిలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ఇప్పటికే రెండు సెట్లు దాఖలు చేయగా తాజాగా మరో రెండు సెట్లు..మొత్తం నాలుగు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డి ఒక సెట్ నామినేషన్ దాఖలు చేయగా, మరో 11 మంది స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ఇప్పటి వరకు 37 నామినేషన్లు వచ్చినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ శశాంక వెల్లడించారు.





నామినేషన్ దాఖలు చేస్తున్న కాంగ్రెస్, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థులు రంజిత్‌రెడ్డి, కాసాని జ్ఞానేశ్వర్

'ఉపాధి హామీ'ని సద్వినియోగం చేసుకోండి

తలకొండపల్లి: ఉపాధిహామీ పనులను పకడ్బందీగా నిర్వహించాలని డీఆర్‌డీఓ శ్రీలత అన్నారు. అవతవకలకు పాల్పడకుండా సక్రమంగా సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా లబ్ధి పొందాలని పేర్కొన్నారు. మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో మంగళవారం ఎంపీడీఓ శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఉపాధిహామీ పనులపై సోషల్ ఆడిట్ చేపట్టారు. గత ఏడాది ఏప్రిల్ ఒకటి నుంచి 2024 మార్చి 31 వరకు రూ.4.50 కోట్ల పనులపై సామాజిక తనిఖీ నిర్వహించారు. కార్యక్రమానికి అసిస్టెంట్ డీఆర్‌డీఓ సుభాషిణి, విజిలెన్స్ అధికారి కొండయ్య, అంబుడ్స్‌మెన్ సునీత, ఎస్ఆర్‌పీలు వెంకన్న, కాశన్న, ఏపీడీ గౌతంచరణ్ హాజరయ్యారు. మండలంలోని రాంపూర్, మెదక్‌పల్లి, చౌదర్‌పల్లి, పడకల్, దేవుని పడకల్, బల్సులపల్లి తండా, గడ్డమీది తండా, వెంకట్రావ్‌పేట్, గౌరిపల్లి, హర్యాతండా తదితర గ్రామాల్లో చేపట్టిన ఉపాధి పనులపై తనిఖీ చేపట్టారు. కార్యక్రమంలో ఏపీఓ కృష్ణ, ఈసీ కృష్ణ, డీపీఆర్‌ఓలు, పంచాయతీ కార్యదర్శులు, సోషల్ ఆడిట్ సిబ్బంది పాల్గొన్నారు.



సామాజిక తనిఖీ నిర్వహిస్తున్న అధికారులు


చిలుకూరులో శోభాయాత్ర ప్రారంభిస్తున్న అర్చకుడు రంగరాజన్


కందుకూరు చౌరస్తాలో హనుమాన్ భక్తులతో ముస్లింలు

ధర్మాన్ని కాపాడేందుకే శోభాయాత్ర

చిలుకూరు బాలాజీ ఆలయ అర్చకుడు రంగరాజన్

మొయినాబాద్: ధర్మాన్ని రక్షించేందుకే హనుమాన్ శోభాయాత్ర చేపడుతున్నామని చిలుకూరు బాలాజీ ఆలయ అర్చకుడు రంగరాజన్ పేర్కొన్నారు. హనుమాన్ జయంతి సందర్భంగా మంగళవారం భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో చిలుకూరు బాలాజీ దేవాలయం నుంచి మొయినాబాద్‌లోని హనుమాన్ ఆలయం వరకు శోభాయాత్ర నిర్వహించారు. చిలుకూరులో అర్చకుడు రంగరాజన్ ప్రత్యేక పూజలు చేసి యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాముని సేవ చేస్తూ ధర్మాన్ని రక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ధర్మాన్ని కాపాడాలనే ఏటా హనుమాన్ జయంతి రోజున శోభాయాత్ర నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో భాగ్యనగర్ ధర్మ ప్రచార ప్రముఖ్ కృష్ణారెడ్డి, భజరంగ్‌దళ్ నేత నందు, నాయకులు గోపాల్‌రెడ్డి, శ్రీరాములు, మహేష్‌చారి, వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మత సామరస్యం చాటిన ముస్లింలు

కందుకూరు: హనుమాన్ జయంతిని పురస్కరించుకుని ముస్లింలు మతసామరస్యాన్ని చాటారు. మంగళవారం మండల పరిధిలోని మహ్మద్‌నగర్‌కు చెందిన ఎండీ ఆసిఫ్ జానీ, ఎండీ ఇలియాస్, ఎండీ పర్వేజ్ శ్రీశైలం రహదారిపై శోభాయాత్రలో పాల్గొన్న భక్తులకు జ్యూస్ ప్యాకెట్లు, తాగునీరు అందించారు. ఏసీపీ లక్ష్మీకాంత్‌రెడ్డి, సీఐ మక్బూల్‌జానీ, ఎస్‌ఐ శ్రావణ్, బీజేపీ నియోజకవర్గం కన్వీనర్ ఎల్మటి దేవేందర్‌రెడ్డి, స్థానిక నాయకులు వెంకటేష్‌గౌడ్, రాజేందర్, శ్రీనివాస్, రాజశేఖర్‌రెడ్డి, ఆంజనేయులు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కడవల కర్మాగారం

- మట్టి కుండల తయారీకి కేరాఫ్‌గా నందివనపర్తి
- ఇక్కడి ఉత్పత్తులకు మార్కెట్‌లో డిమాండ్


యాచారం: మండుటెండలకు చల్లని నీటిని అందించే మట్టి కుండల తయారీకి కేరాఫ్‌గా మండలంలోని నందివనపర్తి గ్రామం మారింది. పేదోడి ఫ్రిజ్‌లుగా పేరొందిన మట్టి కుండల తయారీలో గ్రామ కుమ్మరి వృత్తిదారులు జిల్లాలో పేరు ప్రఖ్యాతలు పొందారు. గ్రామంలోని 40 కుటుంబాలు మట్టి కుండల తయారీపైనే ఆధారపడి జీవనోపాధి పొందుతున్నారు. ఇక్కడ తయారు చేసే కుండలు, వివిధ రకాల పాత్రలు నాణ్యంగా ఉండడంతో జిల్లాతో పాటు నల్గొండ, మహబూబ్‌నగర్, హైదరాబాద్, వరంగల్ తదితర జిల్లాలో మంచి డిమాండ్ ఉంది. ఏటా మార్చి, ఏప్రిల్, మే నెలల్లోనే కుండల తయారీ వ్యాపారం జోరుగా సాగుతుంది.

వేసవిలో సరఫరా ఎక్కువ

స్థానికంగా ఉన్న చెరువులు, కుంటల్లో దొరికే బంకమట్టిని తెచ్చి ఆకర్షించే విధంగా కుండలు, గురుగులు, పాత్రలు తయారు చేస్తారు. రూ.వేలాది ఖర్చు చేసి ఫ్రిజ్‌లు కొనుగోలు చేసే ఆర్థిక స్తోమత లేని పేదలు మట్టి కుండలను ఆశ్రయిస్తారు. అందుకే వీటిని పేదోడి ఫ్రిజ్‌గా అభివర్ణిస్తారు. వేసవికాలంలో మట్టి కుండలో నీళ్లు తాగితే వేడి నుంచి ఉపశమనం కలుగుతుందని ప్రజలు వీటికే మొగ్గు చూపుతారు. గ్రామంలో వృత్తిదారులు తయారు చేసే కుండలను ఆర్డర్లపై సరఫరా చేస్తారు. ఏటా మార్చి, ఏప్రిల్, మే నెలల్లో గ్రామం నుంచి వందలాది డీసీఎంల్లో మట్టి కుండలను తరలిస్తారు.

ఏటా రూ.కోటికి పైగా వ్యాపారం

వృత్తిదారులు కుండల తయారీతో ఏటా రూ.కోటికి పైగానే ఆదాయం పొందుతారు. ఒక్కో కుటుంబం రూ.5 నుంచి రూ.6 లక్షల వరకు ఆర్జిస్తుంది. కేవలం వేసవిలోనే కాక వివిధ ప్రాంతాల్లో విక్రయించుకునే విధంగా మట్టి పాత్రలు తయారు చేస్తారు. ఉగాది, దీపావళి, పెళ్లిళ్లు, శుభకార్యాల సమయాల్లో మట్టి పాత్రల విక్రయాలు జోరుగా ఉంటాయి. కుండల తయారీకి తమకు ఎంతో పేరున్నా, ప్రభుత్వ పరంగా ఏ మాత్రం ప్రోత్సాహం లభించడం లేదని గ్రామ కుమ్మరులు వాపోతున్నారు. అప్పులు చేసి కుండలు తయారీ చేయడంతో వచ్చిన లాభాల్లో అధికశాతం చెల్లింపులకే పోతుందన్నారు. సర్కార్ చేయూతనిస్తే గ్రామానికి మరింతా పేరు తెస్తామని వృత్తిదారులు అంటున్నారు.


నందివనపర్తిలో విక్రయానికి సిద్ధంగా మట్టి కుండలు


కడవల తయారీలో నిమగ్నమైన మల్లయ్య


కుండలను గుద్రంగా మల్చుతున్న రాములమ్మ

40 ఏళ్లుగా ఇదే వృత్తి

కుల వృత్తిని నమ్ముకుని 40 ఏళ్లుగా జీవనోపాధి పొందుతున్నాను. కుండల తయారీతోనే పిల్లలను చదివించాను. ఎంతో మందికి కుండల తయారీని నేర్పించాను. నాటికి, నేటికి ఎన్నో మార్పులు వచ్చాయి. ప్రభుత్వం నుంచి సహకారం అందాలి.
– బుచ్చయ్య, నందివనపర్తి

రుణాలు ఇప్పించాలి

డిగ్రీ చదివినా కుల వృత్తిని మాత్రం మర్చి పోలేదు. ప్రభుత్వ ఉద్యోగాలకు సన్నద్ధం అవుతూనే కుండలు తయారు చేస్తున్న. వేసవిలో అర్డర్ల మేరకు విక్రయాలు చేస్తాను.సర్కార్ బ్యాంకుల ద్వారా రాయితీపై రుణాలు ఇప్పించేలా ప్రభుత్వం కృషి చేయాలి.
– శ్రీకాంత్, నందివనపర్తి

విద్యుత్ యంత్రాలతో..

కేంద్ర ప్రభుత్వం గ్రామంలోని 20 కుటుంబాలకు ఖాదీ ఇండియా పథకం కింద విద్యుత్ యంత్రాలను ఇప్పించాను. ఏళ్లుగా మా కుల పెద్దలు రెక్కల కష్టంతోనే కుండల తయారీ చేసేవారు. యంత్రాల ద్వారా వీటిని సులభంగా తయారు చేస్తున్నారు.
– నాగరాజు, నందివనపర్తి

బీజేపీతోనే పేదలకు మేలు

కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సతీమణి సంగీతరెడ్డి


ఇంటింటి ప్రచారంలో ఓటు అభ్యర్థిస్తున్న సంగీతరెడ్డి

మీర్‌పేట: బీజేపీ మేనిఫెస్టో పేద, మధ్య తరగతి ప్రజలకు మేలు చేసే విధంగా ఉందని ఆ పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సతీమణి సంగీతరెడ్డి పేర్కొన్నారు. మీర్‌పేట కార్పొరేషన్ పరిధిలోని బీజేపీ క్వార్టర్స్‌లో మంగళవారం ఆమె ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్‌తో పాటు ఇతర పార్టీలు మైనార్టీలను కేవలం ఓటు బ్యాంకుగానే చూస్తున్నాయని, ఇది సరైన పద్ధతి కాదన్నారు. ప్రధాని నరేంద్రమోదీ ఆవాస్ యోజన పథకం కింద 33 శాతం మైనార్టీలకు ఇళ్లను నిర్మించినట్లు గుర్తుచేశారు. దేశాన్ని ఆర్థికంగా ముందుకు తీసుకెళ్లి 25 కోట్ల మందిని పేదరికానికి దూరం చేశారన్నారు. ఆయుష్మాన్ భారత్, ముద్రలోన్‌లు, మేకిన్ ఇండియా, వికసిత్ భారత్, విశ్వకర్మ వంటి పథకాలతో పాటు మహిళలకు 33 శాతం రిజర్వేషన్‌లు ఇచ్చిన ఘనత సైతం మోదీకే దక్కుతుందన్నారు. ఈ ప్రాంతంలో ప్రజలు ఎన్నో సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని, ప్రధాని సారథ్యంలో కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ప్రణాళికతో వాటిని పరిష్కరిస్తారన్నారు. కార్యక్రమంలో నాయకులు శంకర్‌రెడ్డి, నర్సింహ, గోవర్థన్‌రెడ్డి, శివపార్వతి, రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

ముగ్గురు జూదరుల అరెస్టు


పట్టుబడ్డ జూదరులను చూపిస్తున్న పోలీసులు

ఇబ్రహీంపట్నం రూరల్: పేకాట స్థావరంపై ఇబ్రహీంపట్నం పోలీసులు దాడి చేసి ముగ్గురిని అరెస్టు చేసిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ మారయ్య కథనం ప్రకారం.. మండల పరిధిలోని పోచారం గ్రామంలో పులకంటి రణవీర్‌రెడ్డి వ్యవసాయ పొలంలో కొంత మంది పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో పోలీసులు దాడి చేశారు. ఇందులో ముగ్గురు జూదరులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి రూ.6,500 నగదు, 4 సెల్‌ఫోన్లు, 3 ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

బెల్టు షాపులపై పోలీసుల దాడులు

తలకొండపల్లి: మండలంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరిపై పోలీసులు మంగళవారం కేసులు నమోదు చేశారు. ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని మెదక్‌పల్లిలో జంగయ్య, చంద్రధనలో శివ కిరాణా షాపుల్లో పక్కా సమాచారంతో పోలీసులు దాడి చేయగా మద్యం లభ్యమైంది. జంగయ్య వద్ద 22 క్వార్టర్లు, 5 ఫుల్ బాటిళ్లు, శివ వద్ద 10 క్వార్టర్లు, 6 బీర్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత


పోలీసులు స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్

కేశంపేట: పెట్రోలింగ్‌లో ఉన్న పోలీసులు వాగులో నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను గుర్తించి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సంఘటన మండల పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తొమ్మిదిరేకుల గ్రామశివారులో ఉన్న వాగు నుంచి ఇసుకను తరలిస్తుండగా పోలీసులు గుర్తించారు. ఎలాంటి అనుమతులు లేకపోవడంతో ట్రాక్టర్‌ని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ లింగం తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

షాద్‌నగర్‌రూరల్: అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం పట్టణ శివారులోని పాత జాతీయ రహదారి సమీపంలో చోటు చేసుకుంది. ఏఎస్‌ఐ నర్సింహానాయక్ కథనం ప్రకారం.. నందిగామ మండల కేంద్రానికి చెందిన పకీరయ్య(50) తాగుడుకు బానిస అయ్యారు. ఆయన గ్రామంలో తిరుగుతూ భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో పట్టణ శివారులోని రీగల్ ఫంక్షన్ హాలు సమీపంలో గుర్తు తెలియని శవం లభ్యమయిన విషయాన్ని తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతుడి వివరాలు తెలియకపోవడంతో సామాజిక మాధ్యమాలలో పోస్టు చేశారు. మృతుడిని గుర్తించిన నందిగామ గ్రామస్తులు భార్యకు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకొని ఆమె మృతదేహాన్ని ధ్రువీకరించారు. పకీరయ్య వడదెబ్బతో చనిపోయాడా, అనారోగ్య కారణాలతో మృతి చెందాడా అని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతుడికి భార్య, కొడుకు, కూతురు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

తనిఖీలో భారీగా నగదు పట్టివేత

రూ.25 లక్షలు స్వాధీనం


పట్టుబడ్డ నగదును చూపుతున్న సీఐ రాఘవేందర్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: ఎన్నికల దృష్ట్యా ఎలాంటి పత్రాలు లేకుండా తరలిస్తున్న నగదును ఆదిబట్ల పోలీసులు స్వాధీనం చేసు కున్న సంఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. ఔటర్ రింగ్ రోడ్డు ఎగ్జిట్ నంబర్ 12 వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఓ కారులో రూ.25 లక్షల నగదును పోలీసులు పట్టుకున్నారు. వీటిని తరలిస్తు న్న డ్రైవర్ మహ్మద్ ఇక్బాల్, కిందొడ్డి సునీల్‌కుమార్‌లను అదుపులోకి తీసుకున్నారు. ఎలాంటి పత్రాలు లేకుండా తరలిస్తున్నట్లు విచారణలో తేలింది. రేడియంట్ క్యాష్ మేనేజ్‌మెంట్ సర్వీస్‌కు చెందిన డబ్బుగా పోలీసులు గుర్తించారు. ఏటీఎంలలో వేయడానికి తీసుకెళ్తుండగా పట్టుబడినట్లు తెలిపారు. నగదును గ్రీవియెన్స్ సెల్‌కు తరలిస్తామని సీఐ వివరించారు.

27 లోగా హజ్‌యాత్ర డబ్బులు జమచేయాలి

సాక్షి,సిటీబ్యూరో: తెలంగాణ రాష్ట్రం నుంచి 2024 హజ్ యాత్రకు ఎంపికైన యాత్రికులు ప్రయాణ ఖర్చుల నిమిత్తం మూడో విడత డబ్బులను ఏప్రిల్ 27లోగా చెల్లించాలని రాష్ట్ర హజ్ కమిటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ షేక్ లియాకత్ తెలిపారు. మంగళవారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. 10వ తేదీ వరకు చివరి గడువును యాత్రికుల విజ్ఞప్తి మేరకు ఈ నెల 27 వరకు పొడిగించినట్లు తెలిపారు. హజ్ యాత్రకు ఎంపికైన వారు ఇప్పటికే మొదటి విడతగా రూ. 82,800, రెండో విడతగా రూ. 1.70 లక్షలు చెల్లించినట్లు తెలిపారు. మూడో విడతగా రూ.లక్ష చెల్లించాల్సి ఉంటుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 7 వేల మంది హజ్ యాత్రకు ఎంపికయ్యారని, డబ్బులు చెల్లించని వారి స్థానంలో ఇతరులకు అవకాశం కల్పిస్తామన్నారు. యాత్రికులు యాత్రకు అసరమైన ఒరిజినల్ సర్టిఫికేట్లతో పాటు పాస్‌పోర్టును రాష్ట్ర హజ్ కమిటీ కార్యాలయంలో జమ చేయాలని తెలిపారు. దీంతో పాటు సీరియల్ నెంబర్ వెయ్యి వరకు వెయిటింగ్‌లో ఉన్న వారు కూడా పాస్‌పోర్టు జమచేయాల్సి ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు haj commite.gov.in సందర్శించాలన్నారు.

దళితుల అభివృద్ధే ధ్యేయం

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాబయ్య


వాహనాల ర్యాలీ ప్రారంభిస్తున్న బాబయ్య

షాద్‌నగర్‌రూరల్: దేశంలో దళితుల అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య అన్నారు. మంగళవారం పాలమూరులో నిర్వహించిన బీజేపీ ఎస్సీ మోర్చా ఆత్మీయ సమ్మేళనానికి సీనియర్ నాయకుడు ఎంకనోళ్ల వెంకటేశ్ ఆధ్వర్యంలో నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా అందె బాబయ్య జెండా ఊపి వాహనాల ర్యాలీ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ దళితులను ఓటు బ్యాంకు కోసమే వాడుకుంటుందన్నారు. కాంగ్రెస్ పార్టీ దళితులను ఏనాడూ పట్టించుకోలేదని విమర్శించారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాకే దళితుల జీవన విధానంలో మార్పు వచ్చిందన్నారు. దేశాభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని రాబోయే ఎన్నికల్లో బీజేపీకి పట్టం కట్టాలని సూచించారు. కార్యక్రమంలో నర్సింలు, కృష్ణయ్య, నర్సింలు, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఐపీఎల్ మ్యాచ్‌కు మెట్రో అదనపు సర్వీసులు

సాక్షి, సిటీబ్యూరో: ఉప్పల్ క్రికెట్ స్టేడియంలో ఈ నెల 25న జరుగనున్న ఐపీఎల్ మ్యాచ్ సందర్భంగా మెట్రో అదనపు సర్వీసులు నడపనున్నట్లు హైదరాబాద్ మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని నగరంలోని మూడు కారిడార్‌లలో ఆఖరి మెట్రో సర్వీసులు గురువారం రాత్రి 12.15 గంటలకు బయలుదేరి తెల్లవారుజామున 1.10 గంటలకు గమ్యస్థానాలకు చేరుకుంటాయి. ఉప్పల్, స్టేడియం, ఎన్‌జీఆర్ఐ స్టేషన్‌లలో మాత్రం ప్రవేశ, నిష్క్రమణ ద్వారాలు తెరిచి ఉంచుతారు. మిగతా స్టేషన్లలో కేవలం నిష్క్రమణ ద్వారాలు మాత్రమే తెరిచి ఉంటాయి.

60 అదనపు బస్సులు..

ఐపీఎల్ మ్యాచ్‌ను వీక్షించేందుకు వచ్చే క్రికెట్ అభిమానుల రద్దీని దృష్టిలో ఉంచుకుని నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి గురువారం ఉప్పల్ స్టేడియం వరకు 60 బస్సులను అదనంగా నడపనున్నట్లు ఆర్టీసీ గ్రేటర్ హైదరాబాద్ ఈడీ వెంకటేశ్వర్లు తెలిపారు.అర్ధరాత్రి వరకు ఈ బస్సులు అందుబాటులో ఉంటాయి. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా అదనపు సర్వీసులను ఏర్పాటు చేయనున్నారు.

నేత్రపర్వం.. రథోత్సవం


ఆలయ పురవీధుల్లో స్వామివారి రథోత్సవం

అంగరంగ వైభవంగా చిలుకూరు బాలాజీ బ్రహ్మోత్సవాలు


డోలు వాయిద్యాలతో నృత్యాలు చేస్తున్న కళాకారులు

మొయినాబాద్: భక్తుల గోవింద నామస్మరణలు.. వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ జిల్లాలో ప్రఖ్యాతిగాంచిన చిలుకూరు బాలాజీ దివ్య రథోత్సవం నేత్రపర్వంగా సాగింది. స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన రథోత్సవం మంగళవారం రాత్రి కనుల పండువగా నిర్వహించారు. వేంకటేశ్వరస్వామి, శ్రీదేవి, భూదేవి సమేతంగా రథంపై ఆసీనులై దేవాలయం చుట్టూ ఊరేగించా రు. భక్తుల జయ జయ ధ్వనుల మధ్య రథోత్సవం వైభవంగా సాగింది. కార్యక్రమంలో అర్చకుడు రంగరాజన్, ఎంపీపీ నక్షత్రం, మాజీ సర్పంచ్ స్వరూప, ఆలయ మేనేజింగ్ కమిటీ చైర్మన్ సౌందరరాజన్, కన్వీనర్ గోపాలకృష్ణస్వామి, కిరణాచారి, రామాచారి, నరసింహ, కన్నయ్య, కిట్టు, సురేష్, గ్రామపెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

శివసాయినగర్ కాలనీలో పేలిన ట్రాన్స్‌ఫార్మర్


ట్రాన్స్‌ఫార్మర్ నుంచి వస్తున్న మంటలు

బండ్లగూడ: ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంలో విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది విఫలం అవుతున్నారని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శివసాయినగర్ కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో విద్యుత్ సమస్యలు ఏర్పడడంతో అధికారులు, ప్రజాప్రతినిధులు చుట్టూ తిరిగితే వారం క్రితం ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. ఇక తమ సమస్య తీరిందని అంతా భావించారు. కానీ అది కాస్తా బెడిసి కొట్టింది. నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ సోమవారం రాత్రి పేలిపోయి భారీగా మంటలు లేచాయి. దీంతో స్థానికులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. మరోవైపు రాత్రంతా కరెంట్ లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ విషయమై అధికారులకు ఫిర్యాదు చేసిన ఎలాంటి చర్యలు తీసుకోలేదని స్థానికులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా మరో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరా చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.